క్లుప్తంగా

జులై 1న 'గోర్ బంజారా'

అన్నపురెడ్డిపల్లి: హైదారాబాద్ రవీంద్రభారతిలో జులై 1 తారీకు నిర్వహించే గోర్ బంజారా ఆత్మీయ సమ్మేళనం, లంబాడి హక్కుల పోరాట సమితి 28 వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను జయప్రదం చేయాలని లంబాడా హక్కుల పోరాట సమితి సమన్వయ కమిటీ కో–కన్వీనర్ రమేష్ నాయక్ పిలుపునిచ్చారు. గురువారం మండల కేంద్రంలో ఆ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొని, కరపత్రాలను ఆవిష్కరించి, మట్లాడారు. గోర్ బంజారా ఆత్మీయ సమ్మేళనానికి బంజారా నాయకులు తరలి రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా నాయకులు చెన్నారావునాయక్, భాస్కర్ జాదవ్, రామచంద్, ధారావత్ కౌసల్య తదితరులు పాల్గొన్నారు.

నిర్లక్ష్యంతోనే తాగునీటి సరఫరాలో అవాంతరాలు

బూర్గంపాడు: గ్రామపంచాయతీ సిబ్బంది నిర్లక్ష్యంతోనే తాగునీటి సరఫరాలో తరచు అవాంతరాలు వస్తున్నాయని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ డివిజన్ నాయకులు పున్నంచంద్ ఆరోపించారు. గురువారం విడుదల చేసిన ఓ ప్రకటనలో మూడురోజులుగా గ్రామాల్లో మంచినీటి సరఫరా జరగకపోవటంతో ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. మిషన్ భగీరథ తాగునీటి సరఫరాలో తరచు అవాంతరాలు వస్తున్నాయని, సంబంధిత అధికారుల పర్యవేక్షణ లోపంతోనే ఇలాంటి పరిస్థితులు ఉత్పన్నమవుతున్నాయని ఆరోపించారు. ఇప్పటికైనా మిషన్ భగీరథ అధికారులు తాగునీటి సరఫరాలో ఇబ్బందులు లేకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని కోరారు.

వాహనం ఢీకొని పశువుల మృతి

ములకలపల్లి: గుర్తుతెలియని వాహనం ఢీకొట్టిన ఘటనలో 3 గేదెలు, ఆవు మృతిచెందగా.. మరో రెండు గేదెలు తీవ్రంగా గాయపడ్డాయి. మండలపరిధిలోని పూసుగూడెం శివారులోని ముర్రేడువాడు వంతెన సమీపంలో బుధవారం అర్ధరాత్రి ఈ ఘటన చోటు చేసుకుంది. పూసుగూడెంకు చెందిన పేరసాని శేషయ్యకు చెందిన పశువులు మృత్యువాతపడ్డాయి. రూ.6 లక్షల నష్టం వాటిల్లిందని, న్యాయం చేయాలని బాధిత కుటుంబీకులు కోరుతున్నారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలి

అశ్వాపురం: గ్రామ పంచాయతీ కార్మికులకు పెండింగ్‌లో ఉన్న వేతనాలు వెంటనే చెల్లించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి నరాటి ప్రసాద్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని ఏఐటీయూసీ కార్యాలయంలో గురువారం ఏడెల్లి శ్రీను అధ్యక్షతన జరిగిన గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్, వర్కర్స్ యూనియన్ జనరల్ బాడీ సమావేశంలో ఆయన మాట్లాడారు. జీఓ నంబర్ 51 రద్దు చేయాలని, మల్టీపర్పస్ విధానం రద్దు చేయాలని, కనీస వేతనం అమలు చేయాలని, ప్రతి కార్మికునికీ ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి వేల్పుల మల్లికార్జున్, ఎండి.యూసఫ్, సీపీఐ మండల కార్యదర్శి అనంతనేని సురేష్, ఏఐటీయూసీ మండల అధ్యక్షుడు రాయపూడి రాజేష్, నాయకులు ఈనపల్లి సాయి, నాగేంద్రబాబు, సురేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

డిప్యూటీ సీఎంకు వినతి

దమ్మపేట: ఆయిల్‌పామ్ క్షేత్రాల మీదుగా వెళ్తున్న విద్యుత్ లైన్ల మార్పిడికి అవకాశం ఇవ్వాలని పలువురు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను కోరారు. కొత్తగూడెంకు గురువారం వచ్చిన డిప్యూటీసీఎంను అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ, ఆయిల్ పామ్ అడ్వైజరీ కమిటీ సభ్యులు అలపాటి రామచంద్రప్రసాద్, రైతు సంఘం నాయకులు కలిశారు. ఈ సందర్భంగా పామాయిల్ క్షేత్రాల్లో చెట్లపై నుంచి వెళ్లిన ఎల్‌టీ, 11 కేవీ విద్యుత్ లైన్లతో గెలలు కోసే సమయాన ప్రమాదాలు జరిగే అవకాశముందన్నారు. ఈ మేరకు లైన్ల మార్పిడికి అయ్యే వ్యయాన్ని భరించేందుకు రైతులు సిద్ధంగా ఉన్నందున ట్రాన్స్‌కో నుంచి అనుమతులు ఇప్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు దొడ్డా ప్రసాద్, బండి భాస్కర్, కే.వీ.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మంత్రి సీతక్కకు..

మణుగూరురూరల్: తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ పంచాయితీరాజ్ మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో గురువారం మణుగూరు పర్యటనకు విచ్చేసిన తెలంగాణ రాష్ట్ర పంచాయితీరాజ్‌శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్కకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షులు మలవరపు రాజేష్, ప్రధాన కార్యదర్శి గొల్లపూడి శ్రీనివాసరావు మాట్లాడుతూ.. మినిస్టీరియల్ ఉద్యోగుల సీనియార్టీ జాబితాను తయారు చేయాలని, పదోన్నతులు కల్పించాలని, సూపరింటెండెంట్లకు గెజిటెడ్ హోదా కల్పించాలని కోరారు. సమస్యలపై సానుకూలంగా స్పందించిన మంత్రి సీతక్క పదోన్నతులు, గెజిటెడ్ హోదా అంశాలపై తగు చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సంఘం సభ్యులు వెల్డి ప్రసాద్, బానోత్ నాగేశ్వరరావు, ఏ.శ్రీనివాసరావు, పిచ్చేశ్వరరావు, వి.రవీంధర్‌బాబు, కె.శ్రీనివాస కుమార్, కె.పిచ్చేశ్వరరావు, వీసం రాఘవయ్య పాల్గొన్నారు.

నిరుపయోగంగా వైకుంఠధామాలు

- నాసిరకం పనులతో శిథిలావస్థలో నిర్మాణాలు
- గ్రామాలకు దూరంగా ఉండడంతో దుర్వినియోగం



తూరుబాక వైకుంఠధామంలో మందుబాబులు తాగి వదిలేసి మద్యం సీసాలు



గ్రామాలకు దూరంగా నిర్మించిన ప్రగళ్లపల్లి పంచాయతీ వైకుంఠధామం

దుమ్ముగూడెం: గత బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకువచ్చిన వైకుంఠధామాలు మండలంలో నామరూపాలు కోల్పోతున్నాయి. మండలంలోని 37 పంచాయతీలలో వైకుంఠధామ నిర్మాణంలో అడుగడుగునా నాసిరకపు పనులు చేపట్టడంతో రెండేళ్లకే శిథాలావస్థకు చేరి దాని సొగసు చూడతరమా అని ఆ మండల ప్రజలు వ్యంగ్యాస్త్రాలు సంధించే విధంగా మారాయి. కొన్ని పంచాయతీల్లోని వైకుంఠదామాల్లో ఒక్క దహనం కూడ అక్కడ నిర్మించిన ప్లాట్ పారాలపై చేయకుండానే కుంగిపోయిన ఘటనలు కోకోల్లలు. ప్రజలకు ఉపయోగకరంగా కాకుండా ప్రభుత్వ పాలసీలో భాగంగా గ్రామాలకు సుదూరంగా, ప్రధాన రహదారిల వెంబడి వైకుంఠధామాలు నిర్వహించడం వల్ల చాలా పంచాయతీలలో వైకుంఠధామాలు వినియోగంలో లేకుండా పోయాయి. గతంలో దహనసంస్కరాలు నిర్వహించిన స్థలాల్లో నిర్మించిన వైకుంఠధామాల్లో సైతం ప్రజలు దహనసంస్కరాలు చేయకుండా వాటి పక్కన చేస్తుండటం కొసమెరుపు.

రూ.లక్షల్లో వృథా..

వైకుంఠధామాల నిర్మాణంలో మండల వ్యాప్తంగా లక్షల రూపాయలు వృథాగా మారాయి. ఒక్కో వైకుంఠదామం నిర్మాణానికి సుమారు రూ.10 లక్షల నుంచి 12 లక్షల రూపాయలను ప్రభుత్వం కేటాయించింది. వీటిని ఎన్ఆర్ఈజీఎస్, పంచాయతీల ద్వారా నిర్మాణాలు చేపట్టారు. వైకుంఠదామాల దగ్గర కనీస వసతులు ఏర్పాటు చేసి శవదహనానికి వచ్చే ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా సాఫీగా సాగిపోవాలన్నది అప్పటి ప్రభుత్వ లక్ష్యం. కానీ కొన్ని పంచాయతీలలో గ్రామానికి కిలోమీటర్ల దూరల్లో వైకుంఠధామాలు నిర్మించడంతో అక్కడి వరకు శవాలను తీసుకెల్లాలేక సొంత పొలం ఉన్నవారు వారి పొలాల్లో, సొంత జాగా లేని వారు వైకుంఠదామాలు నిర్మాణం కానప్పుడు చేసినట్టు గ్రామ శివారు ప్రాంతాల్లో, గోదావరి నదీ తీరాల్లో దహన కార్యక్రమాలు చేస్తున్నారు. లక్షల ఖర్చులు పెట్టి నిర్మించిన వైకుంఠదామాలు అలంకారప్రాయంగా మారడంతో లక్షల రూపాయలు వృథా అయ్యాయనే వాదన ప్రజల్లో ఉంది.

అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా..

మండలంలో నిర్మించిన వైకుంఠదామాలు అసాంఘిక కార్యక్రమాలకు అడ్డగా మారుతున్నాయి. గ్రామాలకు దూరంగా ఉన్న వైకుంఠదామాల దగ్గర మందుబాబులు, పేకాటరాయుళ్ల విందులు చేసుకుంటున్నారనే ఆరోపణలు వస్తున్నాయి మండలంలోని వైకుంఠదామాలను అంకారప్రాయాలుగా కాకుండా వినియోగంలోకి తీసుకువచ్చే విధంగా అధికారులు చర్యలు తీసుకుని అందుబాటులోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.

సుదూరంగా శ్మశాన వాటిక



ప్రగళ్ళపల్లి పంచాయతీకి కేటాయించిన వైకుంఠధామాన్ని మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న కేశవపట్నంలో నిర్మించారు. బైరాగులపాడు, సున్నంబట్టి గ్రామాలకు చెందిన ఏవరైన మృతి చెందితే మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న ఆ శ్మశాన వాటికకు తీసుకుపోవాలి. అది సాధ్యపడక గోదావరి ఒడ్డున దహన సంస్కరాలను నిర్వహిస్తున్నారు.

– యంబడి అర్జునరావు, సున్నంబట్టి

అలంకారప్రాయంగా ఏర్పాటు



తూరుబాక పంచాయతీలో చర్ల–భద్రాచలం ప్రధాన రహదారిపై నిర్మించిన వైకుంఠదామం అలంకారప్రాయంగా మారింది. నిర్మాణం చేపట్టినప్పటి నుంచి ఇక్కడ ఒక్క దహన సంస్కారం కూడా చేయలేదు. వైకుంఠదామం మందుబాబులకు అడ్డగా మారింది. లక్షల రూపాయలు ఖర్చుపెట్టి ఉపయోగం లేకుండా చేశారు.

– కుమ్మరికుంట సాంబశివరావు, తూరుబాక

రక్తహీనత సమస్యపై అవగాహన

చంద్రుగొండ: చిన్నారుల్లో రక్తహీనత సమస్యను ముందుగానే గుర్తించి నివారణ చర్యలు తీసుకోవాలని స్థానిక పీహెచ్‌సీ డాక్టర్ కనకం తనుజ అన్నారు. మండలకేంద్రం చంద్రుగొండలోని సెయింట్‌జోసఫ్, అన్నారంతండాలోని ప్రాథమిక పాఠశాలల్లో సికిల్‌సెల్ (రక్తహీనత)పై గురువారం విద్యార్థులకు అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతిరోజు పౌష్టికాహారం తీసుకోవాలని, పండ్లు, తాజా కూరగాయలు, ఆకు కూరలు ఆహారంగా తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో హెల్త్‌సూపర్‌వైజర్ యండి.ఇమాం, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.



విద్యార్థులకు రక్తహీనత సమస్యపై అవగాహన కల్పిస్తున్న డాక్టర్ తనుజ

విద్యార్థులకు అన్నదానం

మణుగూరురూరల్: మండలంలోని సంతోష్‌నగర్‌లోని శ్రీవిద్యాభ్యాస(బాలవెలుగు) పాఠశాలలో మణుగూరు ఏరియా పికెఓసి2 ఏ రిలే ఆపరేటర్ కట్టా వెంకటేశ్వర్లు–రేణుక దంపతుల మనువడు పారుపల్లి రేయాన్ జన్మదినోత్సవ వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులకు కట్టా వెంకటేశ్వర్లు దంపతులు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. అలాగే పాఠశాలకు 25 కేజీల బియ్యాన్ని వితరణగా అందజేశారు. కార్యక్రమంలో సింగరేణి సేవా సమితి సభ్యులు ఎస్‌డి నాసర్‌పాషా, బొర్రా మంగాదేవి, పెండ్యాల లక్ష్మయ్య, మంగమ్మ, పాఠశాల నిర్వాహకులు బి.జగన్మోహన్ రెడ్డి, సిబ్బంది సుహాసినిదేవి, స్వాతి, రాధ తదితరులు పాల్గొన్నారు.

సెల్ టవర్ పనులు ప్రారంభం

మణుగూరుటౌన్: సింగరేణి కాలరీస్ మణుగూరు ఏరియాలోని ఓసీ–2 కొత్త సైట్ ఆఫీస్‌లో ఏరియా జీఎం దుర్గం రాంచందర్ బీఎస్ఎన్ఎల్ సెల్ టవర్ ఎరెక్షన్ పనులు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఏరియా అధికారులు పాల్గొన్నారు.

బియ్యం వితరణ

మణుగూరురూరల్: మున్సిపాలిటీ పరిధిలోని కమలాపురం గ్రామంలో దూది రంగారావు గుండెపోటుతో మరణించారు. నిరుపేద కుటుంబం కావడంతో దశదిన కర్మలకు మృతుని కుటుంబం తీవ్ర ఆర్థిక ఇబ్బందులు పడుతోంది. విషయం తెలుసుకున్న పినపాక నియోజకవర్గ పవర్‌స్టార్ పవన్ కల్యాణ్ అభిమానుల సంఘం సభ్యులు గురువారం బాధిత కుటుంబానికి 25 కేజీల బియ్యాన్ని వితరణగా అందజేశారు. కార్యక్రమంలో పినపాక నియోజకవర్గ పవర్‌స్టార్ పవన్ కళ్యాణ్ అభిమానుల సంఘం సభ్యులు, అభిమానులు సురేందర్ పటేల్, ప్రదీప్‌కుమార్, యుగంధర్, ముకుందరావు, సాయిచరణ్, అనిల్‌కుమార్, శ్రీనివాసరావు, వాసు, మహేష్, ప్రసాద్, బాలయ్య, ప్రణయ్‌కుమార్, సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి

మణుగూరుటౌన్: గ్రామ స్థాయి నుంచి పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అయోధ్య పిలుపునిచ్చారు. గురువారం పార్టీ కార్యాలయంలో మండల, పట్టణ కార్యవర్గ సమావేశం ఏడారి రమేష్ అధ్యక్షతన నిర్వహించి మాట్లాడారు. మణుగూరు మండల గ్రామాల అభివృద్ధిలో సీపీఐ పాత్ర మరువలేనిదన్నారు. గ్రామగ్రామాన విద్యుత్, రహదారి, రోడ్ల విస్తరణ, పాఠశాల భవనాలు ఇలా అనేక రకాల అభివృద్ధి కార్యక్రమాల నిర్వహణలో సీపీఐ పాత్ర ఎంతో ఉందన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో గ్రామస్థాయి నుంచి పార్టీ బలోపేతానికి కృషి చేయాలని శాఖ సమావేశాలు ఏర్పాటు చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు సరెడ్డి పుల్లారెడ్డి, మున్నా లక్ష్మీకుమారి, ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు లక్ష్మీనారాయణ, జంగం మోహన్‌రావు, దుర్గ్యాల సుధాకర్, సర్వర్, రాముడు, రమేష్, కామిశెట్టి రామారావు, పాయం లక్ష్మయ్య, మంగి వీరయ్య ఉన్నారు.

'సీతారామ' క్రెడిట్ కేసీఆర్‌దే..

మణుగూరురూరల్: పినపాక నియోజకవర్గంలోని అశ్వాపురం మండలంలో సీతారామ ప్రాజెక్ట్‌ను పూర్తి చేయించిన ఘనత తెలంగాణ రాష్ట్ర ప్రధాత, మాజీ సీఎం కేసీఆర్‌దేనని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు, పినపాక మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు గురువారం సోషల్ మీడియా వేదికగా అన్నారు. దార్శనికుడు కేసీఆర్ కన్న కల నేడు సీతారామ ప్రాజెక్ట్‌తో సాకారమైందన్నారు. సీతారామ ఎత్తిపోతల పథకం ట్రయల్ రన్ విజయవంతం కావడంతో జిల్లాకు శుభ సూచికమన్నారు. గోదావరి జలాలతో ఉమ్మడి ఖమ్మం జిల్లాను సస్యశ్యామలం చేయాలనే సంకల్పంతో ఆనాడు కేసీఆర్ సీతారామ ప్రాజెక్ట్ కు శ్రీకారం చుట్టారన్నారు. కేంద్రంతో పోరాడి సీతారామకు అన్ని అనుమతులు మంజూరు చేయించి 90శాతం పనులను పూర్తి చేయించిన ఘనుడు రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ అన్నారు. కేసీఆర్ హయాంలోనే ప్రాజెక్ట్‌కు మొదటి ట్రయల్ రన్‌ను సైతం నిర్వహించడం జరిగిందన్నారు. లింక్ కెనాల్ ను పూర్తి చేసి ప్రాజెక్ట్‌ను సమర్థవంతంగా వినియోగించుకుంటే 6.75 లక్షల పైచిలుకు ఎకరాలకు సాగు నీరు అందుతుందన్నారు. జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు, జిల్లాలోని ముగ్గురు మంత్రులు.. ప్రాజెక్టుకు ఒక్క పైసా నిధులు ఇవ్వకుండా, తట్టెడు మట్టి వేయకుండా స్విచ్ ఆన్ చేసి కల వేరిందని పేర్కొనడం హాస్యాస్పదంగా ఉందన్నారు.

తుమ్మలచెరువుకు నీరు అందించాలి


అశ్వాపురం: సీతారామ ప్రాజెక్ట్ ద్వారా మండలంలో ప్రధాన సాగునీటి వనరు ఐన తుమ్మలచెరువుకు నీరు అందించాలని మాజీ సర్పంచ్ మర్రి మల్లారెడ్డి, కొల్లు ఉప్పల్‌రెడ్డి, బీజీ కొత్తూరు గ్రామానికి చెందిన భూ నిర్వాసితులు గురువారం పంప్‌హౌస్‌ను సందర్శించిన మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు విన్నవించారు.

గతంలో భూములు ఇచ్చిన సమయంలో తుమ్మలచెరువుకు నీరు అందించాలని కోరామని శంకుస్థాపన సమయంలో చెరువుకు నీరు ఇస్తామని హామీ ఇచ్చారని ఇప్పటి వరకు ఆ పనులు పూర్తి కాలేదని తుమ్మలచెరువుకు నీరు అందించాలని మంత్రిని నిర్వాసితులు కోరారు. తుమ్మలచెరువుకు సీతారామ ప్రాజెక్ట్ ద్వారా నీరు అందించే మారెళ్లపాడు ఎత్తిపోతల పథకం పనులు ఆరు నెలల్లో పూర్తి చేసి తుమ్మలచెరువుకు నీరు అందించాలని మంత్రి తుమ్మల అధికారులను ఆదేశించారు.

సాయిబాబాకు పూజలు

మణుగూరురూరల్: మండలంలోని సాయినగర్‌లో ఉన్న షిరిడి సాయిబాబా ఆలయంలో గురువారం సందర్భంగా సాయినాథుడికి ప్రత్యేక పూజలు, అర్చనలు,అభిషేకాలు నిర్వహించారు. మండలానికి చెందిన భోగ చంద్రమోహన్–నిర్మల దంపతులు, వారి కుమార్తెలు భోగా రేణుగా, అఖిల, కుటుంబ సభ్యులు కృష్ణమూర్తి–జయలక్ష్మి దంపతులు, సురేందర్‌రావు, సవిత, సేవిత్‌కుమార్, దేవివర ప్రసాద్‌లు షిరిడి సాయినాధుని దర్శించుకుని పూజలు చేశారు. అనంతరం భోగా రేణుకు ఉద్యోగం వచ్చిన సందర్భంగా చంద్రమోహన్ కుటుంబ సభ్యుల సహకారంతో ఆలయ ప్రాంగణంలో భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. అన్నదాతలను ఆలయకమిటీ సభ్యులు శాలువాతో సన్మానించి జ్ఞాపిక అందజేశారు. ఆలయ కమిటీ సభ్యుడు దోసపాటి నాగేశ్వరరావు, సీహెచ్ బాలకేశవరావు, అర్చకులు పవన్ కుమార్ వర్మ, వెంకన్న, సాయి సేవకులు పాల్గొన్నారు.

వాహనదారులకు తప్పని తిప్పలు



డైవర్షన్ రోడ్డుపై బురదలో దిగబడిన జామాయిల్ లోడు ట్రాక్టర్

ములకలపల్లి: ములకలపల్లి శివారు తాళ్లపాయ రహదారిలోని పాములేరు వాగుపై వంతెన డైవర్షన్ రోడ్డు గత రెండు రోజులుగా కురుస్తున్న చిరుజల్లులకు బురదమయంగా మారింది. దీంతో ప్రయాణికులకు తిప్పలు తప్పడం లేదు. వంతెన నిర్మాణ పనులు చేపడుతున్న నేపథ్యంలో శిథిలావస్థకు చేరిని మినీబ్రిడ్జిని పూర్తిగా కూల్చివేశారు. తాత్కాలికంగా డైవర్షన్ రోడ్డు నిర్మించి, నూతన వంతెన పనులు ఆరంభించారు. వర్షాలకు ఈ రోడ్డు బురదమయం కావడంతో గురువారం డైవర్షన్ రోడ్డుపై జామాయిల్ లోడుతో వెళ్తున్న ట్రాక్టర్ దిగబడింది. ఫలితంగా తాళ్లపాయ జీపీ కేంద్రంతోపాటు, రింగిరెడ్డిపల్లి, సుందర్‌నగర్ మంగలిగుట్ట తదితర గ్రామాలకు తాత్కాలికంగా రాకపోకలు నిలిచిపోయాయి. కనీసం ద్విచక్ర వాహనాలు కూడా వెళ్లేందుకు అవకాశం లేకపోవడంతో మారుమూల గ్రామాల ఆదివాసీలు అవస్థలు పడ్డారు. ఎట్టకేలకు జేసీబీ సహాయంతో ట్రాక్టర్‌ను బయటికి తీయడంతో, యథివిధిగా ప్రయణాలు సాగాయి.

సాగుకు హక్కు పత్రాలు తప్పనిసరి

చర్లరూరల్: పోడు భూములకు హక్కు పత్రాలు ఉంటేనే సుగు చేసుకోవాలని చర్ల ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ పి.ఉపేంద్ర స్పష్టం చేశారు. గురువారం మండలంలోని గన్నవరం కాలనీ ప్రాంతంలో పోడు సాగుదారులకు, అటవీశాఖ అధికారులకు వివాదం చోటు చేసుకుంది. పోడు సాగుకు సిద్ధమైన గిరిజన రైతుల భూములకు ఫారెస్టు అధికారులు ట్రెంచులను ఏర్పాటు చేయడంతో వివాదం నెలకొంది. ఇదిలా ఉండగా అటవీశాఖ అధికారులు తమపై చేయి చేసుకున్నారని ఆరోపించారు. సాగు చేసుకునేందుకు పోడు హక్కు పత్రాలు వారి దగ్గర లేవని, వారిపై ఎవరూ చేయి చేసుకోలేదని ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ తెలిపారు. వివాదం చోటు చేసుకుంటున్న క్రమంలో అటవీశాఖ అధికారులు పోలీసులకు సమాచారం అందించారు.దీంతో పోలీసులు రంగ ప్రవేశం చేయడంతో వివాదం సద్దు మణిగింది.



పోడు హక్కు పత్రాలు లేని భూముల చుట్టు ఫారెస్ట్ అధికారులు తవ్వించిన కందకాలు

ఎమ్మెల్యే సుడిగాలి పర్యటన

దమ్మపేట: మండలంలో సుడిగాలి పర్యటన చేసిన స్థానిక ఎమ్మెల్యే జారే ఆదినారాయణ.. పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. గురువారం మండలంలోని మొద్దులగూడెం గ్రామంలో ఇటీవలే అనారోగ్యంతో మృతి చెందిన దావల్ సాహెబ్, చిత్రపటానికి పూలతో నివాళులర్పించి, వారి కుటుంబ సభ్యులను పరామర్శించి, అండగా ఉంటానని హామీ ఇచ్చారు. పార్కలగండి గ్రామ పంచాయతీ పరిధిలోని పాకలగూడెం గ్రామంలో ఇటీవలే మృతి చెందిన కుర్సం రాములమ్మ చిత్రపటానికి పూలమాలతో నివాళులర్పించి, ఆమె కుటుంబ సభ్యులను పరామర్శించారు. గుత్తావారిగూడెం, అంకంపాలెం గ్రామాల్లో పలు శుభకార్యాలకు హాజరై, ఆశీర్వదించారు. కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, మండల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

రామాలయంలో ఎమ్మెల్సీ మల్లన్న



ఎమ్మెల్యే వెంకట్రావు, ఎమ్మెల్సీ మల్లన్నకు ఆశీర్వచనం అందజేస్తున్న పండితులు

భద్రాచలం/భద్రాచలంటౌన్: భద్రాచలంలోని శ్రీ సీతారామ చంద్రస్వామి వారిని ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న గురువారం దర్శించుకున్నారు. స్థానిక ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావుతో కలిసి వచ్చిన ఆయనకు అర్చకులు స్వాగతం పలికగా, ఆలయ ప్రదక్షిణ అనంతరం అంతరాలయంలో మూలమూర్తులు, లక్ష్మీతాయారు అమ్మ వారికి పూజలు చేశారు. అలాగే, ఎమ్మెల్సీ హోదాలో తొలిసారి భద్రాచలం వచ్చిన మల్లన్నను డీసీసీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే పొదెం వీరయ్య తన నివాసంలో సత్కరించారు. కాంగ్రెస్ నాయకులు చింతిరేల రవికుమార్, పరిమి శ్రీనివాసరావు, అడబాల వెంకటేశ్వరరావు, సాంబశివరావు, వరుణ్, శీలం రామ్మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. అనంతరం భద్రాచలంలోని కల్పవృక్ష నర్సింహ సాలగ్రామమూర్తిని ఎమ్మెల్సీ మల్లన్న గురువారం దర్శించుకుని పూజలు చేశారు.

వలస ఆదివాసీలపై వివక్ష తగదు

ములకలపల్లి: వలస ఆదివాసీలపై రాష్ట్ర ప్రభుత్వం వివక్ష చూపరాదని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ జిల్లా కార్యదర్శి కెచ్చెల రంగారెడ్డి అన్నారు. మండలపరిధిలోని రాచన్నగూడెం గ్రామంలో కొర్సా గణపతి అధ్యక్షతన గురువారం జరిగిన వలస ఆదివాసీల ముఖ్యసమావేశంలో పాల్గొన్న ఆయన మాట్లాడారు. గొత్తికోయ గుంపులకు తాగునీరు, విద్యుత్, విద్య తదితర మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. ఆదివాసీలు సాగు చేస్తున్న పోడు భూములను సర్వే చేపట్టి, హక్కుపత్రాలివ్వాలని అన్నారు. వలస ఆదివాసీల ఇళ్లను గ్రామపంచాయతీ రిజిష్టర్లలో నమోదు చేసి, ఇంటి నంబర్లు కేటాయించాలన్నారు.

ఈ కార్యక్రమంలో నూపా భాస్కర్, పోతుగంటి లక్ష్మణ్, ఎంపీటీసీ మడకం విజయ, నాయకులు పద్దం లక్ష్మణరావు, యర్రగొర్ల రామారావు, నకిరకంటి నాగేశ్వరరావు, పద్దం వెంకటేశ్, కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నిర్మాణాన్ని జెన్‌కోకే అప్పగించాలి

మణుగూరురూరల్: రామగుండం థర్మల్ పవర్ స్టేషన్(ఆర్‌టీఎస్)ను తెలంగాణ జెన్‌కో ఆధ్వర్యంలోనే నిర్మించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ పవర్ ఎంప్లాయిస్ జేఏసీ ఆధ్వర్యంలో బీటీపీఎస్ కార్యాలయం ఎదుట గురువారం నిరసన వ్యక్తం చేశారు. టీజీపీఈ సభ్యులు ప్లకార్డులు చేతబూని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా జేఏసీ నాయకులు మాట్లాడుతూ.. రామగుండంలో గతంలో జెన్‌కో ఆధ్వర్యంలో నిర్మించిన ఆర్‌టీఎస్ జీవన కాలం ముగిసిందని, దాని స్థానంలో నిర్మించబోయే విద్యుత్ కేంద్రం పనులను రాష్ట్ర ప్రభుత్వం సింగరేణికి అప్పగించాలనుకోవడం సరికాదని అన్నారు. ఆర్‌టీఎస్ కేంద్ర నిర్మాణ పనులకు జెన్‌కో వారికే అప్పగించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో జేఏసి ఆధ్వర్యంలో ఆందోళనలు నిర్వహిస్తామని హెచ్చరించారు. అనంతరం బీటీపీఎస్ సీఈ బిచ్చన్నకు డిమాండ్‌తో కూడిన వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నాయకులు ఎస్ శ్రీనివాస్‌రెడ్డి, సి.రాజబాబు, నరేష్, వి.ప్రసాద్, ఎస్.సత్యనారాయణ, బి.కృష్ణ, వీరస్వామి, దయాకర్, వెంకట్రామ ఆర్.రామచందర్ పాల్గొన్నారు.



బీటీపీఎస్ సీఈకి వినతిపత్రం సమర్పిస్తున్న జేఏసీ నాయకులు

ఉచిత వైద్య శిబిరం

మణుగూరుటౌన్: సింగరేణి సేవా సమితి, వైద్య ఆరోగ్య విభాగం ఆధ్వర్యంలో మణుగూరు మండల పరిధిలోని విప్పలసింగారం పంచాయతీలో గురువారం సింగరేణి ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా సీనియర్ వైద్యులు శేషగిరిరావు 126 మంది గ్రామస్తులకు ఉచిత వైద్య సేవలందించి బీపీ, షుగర్‌తో పాటు సీజనల్ వ్యాధులకు మందులు అందించారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ.. సింగరేణి తన బాధ్యతగా ప్రభావిత గ్రామాల ప్రజలకు మెరుగైన వైద్యం అందిస్తుందన్నారు. తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న వారిని స్థానిక సింగరేణి ఏరియా ఆస్పత్రికి రావాల్సిందిగా సూచించారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది రూపశ్రీ, గ్రామస్తులు సోడె రవి, వజ్జా నరేశ్, కారం లక్ష్మి, మణెమ్మ, ఝాన్సీ ఆస్పత్రి సిబ్బంది తదితరులు ఉన్నారు.

పాఠశాలలో సమస్యలు పరిష్కరించాలి

దుమ్ముగూడెం: మండలంలోని సీఎస్ఐ పాఠశాలల నిర్వహణను అటు యాజమాన్యం, ఇటు అధికారులు పట్టించుకోకపోవడంతో సమస్యలతో సతమతమవుతున్నాయని విద్యార్థులు వాపోతున్నారు. మండల కేంద్రంలో సీఎస్ఐ పాఠశాల ఉండగా, భవనం శిథిలావస్థకు చేరడంతో కొందరు దాతల సహకారంతో భవనం కట్టించారు. అయితే, ఇందులో తాగునీరు, టాయిలెట్లు, వంట షెడ్డు ఇతర సౌకర్యాలు లేక ఇబ్బంది పడుతున్నామని విద్యార్థులు చెబుతున్నారు. కూలీ పనులు చేసుకునే తమ తల్లిదండ్రులు ప్రైవేట్ పాఠశాలలకు పంపించే పరిస్థితి లేనందునే, సీఎస్సై పాఠశాలలో వసతుల కల్పనకు దాతలు ముందుకు రావాలని చిన్నారులు కోరుతున్నారు.

హై టెన్షన్ .. టెన్షన్..

ములకలపల్లి: హైటెన్షన్ విద్యుత్ లైన్లు మండలకేంద్ర ప్రజానీకాన్ని టెన్షన్‌కు గురిచేస్తున్నాయి. దమ్మపేట మండలంలోని అంకంపాలెం సబ్‌స్టేషన్ నుంచి ఇన్ అండ్ అవుట్ సప్లై నిమిత్తం 33 కేవీ విద్యుత్ లైన్లు ఏర్పాటు చేశారు. అయితే ములకలపల్లి షిర్డీ సాయిబాబా అలయ సమీపంలో ఓ భారీ వృక్షం, దాని కొమ్మలు ఈలైన్ల పైన విస్తరించి ఉన్నాయి. ఈ చెట్టు పూర్తిగా తీగెల వైపే పూర్తిగా వాలిపోయి ఉంది. వర్షాకాలం నేపథ్యంలో ఈదురుగాలులకు కొమ్మలు విరిగి పడిపోతాయేమోనని, అసలు వృక్షమే ఒరిగిపోతుందేమోనని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. ఏ ప్రమాదం వాటిల్లక ముందే తగుచర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.





విద్యుత్‌లైన్‌పై వాలిపోయిన చెట్టు